
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



టమాట కిలో రూ.25

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.24, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/23.8°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వినాయకుని లడ్డూ @ రూ.2 లక్షలు



వేలంలో లడ్డూ దక్కించుకున్న సానే చంద్రశేఖర్‌రెడ్డి

ముదిగుబ్బ: ఎనుమలవారిపల్లిలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా స్వామి వారి లడ్డూను మంగళవారం వేలం వేశారు. గ్రామానికి చెందిన సానే చంద్రశేఖర్‌రెడ్డి రూ.2 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు.

14 నుంచి 'స్వచ్ఛతా హీ సేవా'

- అధికారులంతా సన్నద్ధం కావాలని కలెక్టర్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు జిల్లాలో ఈ నెల 14 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించాలని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను 'స్వభావ్ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత' అనే నినాదంతో నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా 14 నుంచి 17వ తేదీ వరకు సన్నద్ధతలో భాగంగా ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్‌షాప్‌లు తదితర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 17వ తేదీ నుంచి సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమం కింద అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రెండు వారాల పాటు జిల్లాలో మెగా శుభ్రతా డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, విస్తరణాధికారులు, సంబంధిత గ్రామ స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని డీపీఓ, జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. హాజరైన 95 మంది యువతీ యువకులను ఐదు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. వీరిలో ప్రతిభ కనబరచిన 42 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు.

రేపటి నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచులు

- రెండు మైదానాల్లో పోటీలు
- శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కులదీప్ యాదవ్, ఆకాష్ దీప్ దూరం




అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా గురువారం నుంచి ఆర్డీటీ క్రీడా గ్రామంలోని రెండు మైదానాల్లో మ్యాచులు జరగనున్నాయి. బుధవారం క్రీడాకారులు నెట్ ప్రాక్టీస్‌లో బిజీగా గడిపారు. ఇండియా–ఏ జట్టుకు చెందిన మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ఎస్‌కే రషీద్, తిలక్ వర్మ, శివమ్ దూబేతో పాటు ఇండియా–బి జట్టుకు చెందిన అభిమన్యు ఈశ్వరన్, రింకూ సింగ్, నవదీప్ సైనీ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్ తదితరులు ప్రాక్టీస్ చేశారు.

స్టార్ క్రికెటర్లు దూరం..

దులీప్ ట్రోఫీకి ఐదుగురు స్టార్ క్రికెటర్లు దూరమయ్యారు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టెస్ట్ మ్యాచులకు ఎంపిక కావడంతో శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కులదీప్ యాదవ్, ఆకాష్ దీప్‌లు రావడం లేదు. దీంతో వీరి స్థానంలో ప్రథమ్ సింగ్ (రైల్వేస్), ఆకాష్ వాడ్కెర్ (విదర్భ), ఎస్‌కే రషీద్ (ఆంధ్రా), స్పిన్నర్ షామ్స్ ములాని, అకిబ్ ఖాన్ (ఉత్తరప్రదేశ్)లకు చోటు కల్పించారు. మయాంక్ అగర్వాల్ ఇండియా–ఏ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

టీచర్లకు సర్దుపోటు!



రొద్దం మండలం కందుకూర్లపల్లి పాఠశాల(ఎంపీపీఎస్)లో పనిచేసే మారుతి ప్రసాద్‌రెడ్డిని హిందూపురం మండలం కొట్నూరు ఉన్నత పాఠశాలకు ఉన్నతాధికారులు సర్దుబాటు చేశారు. విద్యాసంవత్సరం అప్పటికే ప్రారంభం కాగా పిల్లలను స్థానికంగా ఉన్న పాఠశాలల్లో చేర్పించిన మారుతి ప్రసాద్‌రెడ్డి కుటుంబాన్ని హిందూపురం తీసుకువెళ్లలేని పరిస్థితి. దీంతో అతను రోజూ రానుపోనూ 70 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

రొద్దం మండలం చిన్నకొడుపిహాళ్లి పాఠశాల (ఎంపీపీఎస్)లో ఇంగ్లిష్ బోధించే మహబూబ్‌బాషాను అధికారులు సర్దుబాటు పేరుతో హిందూపురం మండలం మలుగూరు ఉన్నత పాఠశాలకు పంపారు. దీంతో అతను రోజూ రానుపోను 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. పైగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధించడం ఇబ్బందిగా మారిందంటున్నాడు.

...ఇలా వీరిద్దరే కాదు. ఉన్నతాధికారుల కరుణలేని వారంతా ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి సర్దుబాటు పేరుతో సుదూర ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలకు బదిలీ అయ్యారు. కుటుంబాలను అక్కడికి తీసుకువెళ్లలేని పరిస్థితుల్లో రోజూ కి.మీ దూరం ప్రయాణిస్తూ అగచాట్లు పడుతున్నారు. అలాగే ఉన్నత పాఠశాలల్లోని పిల్లలకు పాఠాలు బోధించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

- అస్తవ్యస్తంగా సర్దుబాటు ప్రక్రియ
- ఇష్టానుసారం స్కూళ్లు కేటాయించిన ఉన్నతాధికారులు
- 40 కి.మీ దూరంలోని పాఠశాలలకు బదిలీ
- విద్యాసంవత్సరం మధ్యలో కుటుంబాలను మార్చుకోలేక అవస్థలు
- రోజూ తప్పని అప్‌అండ్‌డౌన్
- ప్రభుత్వ తీరుపై గురువుల గుర్రు

పుట్టపర్తి: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ తీవ్ర జిల్లాలో గందరగోళంగా సాగుతోంది. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారుతున్నాయి. వాస్తవానికి ఉన్నత పాఠశాలల్లో అవసరమైన మేరకు సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు 117 జీఓను అనుసరించి సర్దుబాటు చేస్తున్నారు. ఈ క్రమంలో మిగులుగా ఉన్న సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్లు)లను సబ్జెక్టు మెథడాలజీని బట్టి ఉన్నత పాఠశాలలకు బలవంతంగా సర్దుబాటు చేస్తున్నారు. దీని ప్రభావం ప్రాథమిక పాఠశాలలపై పడుతోంది.

ఇష్టానుసారంగా సర్దుబాటు

వాస్తవానికి మొదటి దశలో సబ్జెక్టు టీచర్లకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లను మండల స్థాయిలో సర్దుబాటు చేయాలి. ఆ తర్వాత రెండో దశలో మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లను డివిజనల్, ఆ తర్వాత జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలి. ఇక మూడో దశలో సెకండ్ గ్రేడ్ టీచర్లను మండల స్థాయిలో సర్దుబాటు చేయాలి. అప్పటికీ మిగులు టీచర్లు ఉంటే డివిజనల్, జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలి. ఇలా చేయటం వలన పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ ఉన్నతాధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో అవసరమున్న చోట మాత్రమే స్కూల్ అసిస్టెంట్లను తీసుకుని, మిగిలిన ఖాళీలను సెకండ్ గ్రేడ్ టీచర్లను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో స్కూల్ అసిస్టెంట్లు పాత స్కూల్‌కే పరిమితం కాగా, ఎస్జీటీలు మాత్రం ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే సర్దుబాటు ప్రక్రియ పూర్తయినప్పటికీ ఎక్కువ మంది ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలకు ఇప్పటికీ వెళ్లడం లేదు. జిల్లాలో 520 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ ఉన్నతాధికారులు సర్దుబాటు చేయగా, వీరిలో స్కూల్ అసిస్టెంట్లను డివిజన్, జిల్లా స్థాయిలో 60 నుంచి 70 కిలోమీటర్ల దూరం వరకు సర్దుబాటు చేశారు. దీంతో వారంతా తాము అంతదూరం మేమెందుకు వెళతామని మొండికేశారు.

ప్రమోషన్ వద్దనుకున్నా..

గతేడాదే సెకండ్ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లకు పదోన్నతులు కల్పించారు. విల్లింగ్ ఉన్న ప్రతి ఎస్జీటీకి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. అయితే కొందరు ఎస్జీటీలు వివిధ కారణాలతో పదోన్నతులు వదులుకున్నారు. ప్రస్తుతం సర్దుబాటు పేరుతో వారినే సబ్జెక్టు టీచర్లుగా ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటూ బలవంతం చేస్తున్నారు. దీంతో చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మారుతున్నాయి. భవిష్యత్తులో వీటి ఉనికి ప్రశ్నార్థకం కానుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

నలుగురుండాల్సిన చోట ఒక్కరే

కదిరి వీవర్స్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో 1,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ సంఖ్యా పరంగా నలుగురు హిందీ అసిస్టెంట్లు ఉండాలి. కానీ విద్యాశాఖ అధికారులు ఒకే ఒక్క హిందీ అసిస్టెంట్‌ను సర్దుబాటు చేశారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కష్టాలు

ఇక 1998–2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పని సర్దుబాటులో భాగంగా వీరు పని చేస్తున్న మండలాల నుంచి జిల్లా స్థాయిలో 40 కిలో మీటర్ల దూరం ఉన్న ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఇది అత్యంత దారుణమని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై మండి పడుతున్నారు.

2,078
జిల్లాలోని పాఠశాలలు

1,27,104
విద్యార్థుల సంఖ్య

8,307
ఉపాధ్యాయుల సంఖ్య

520
సర్దుబాటు చేసిన టీచర్ల సంఖ్య

ముందుగా ఎస్ఏలతోనే సర్దుబాటు చేయాలి



ఉన్నత పాఠశాలలకు మండలంలోని ఇతర స్కూళ్లలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లతోనే సర్దుబాటు చేయాలి. ఆ తర్వాత డివిజన్, జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలి. అప్పటికీ ఉన్నత పాఠశాలలో ఖాళీలుంటే .. చివరగా మెథడాలజీ ఆధారంగా సెకండ్ గ్రేడ్ టీచర్లతో సర్దుబాటు చేయాలి. అలా కాకుండా ప్రభుత్వం అడ్డగోలుగా పని సర్దుబాటు చేసింది.

– ఇంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ టీఏ

117 జీఓ రద్దు తర్వాతే సర్దుబాటు చేయాలి



ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను పునఃపరిశీలించాలి. లేదంటే పూర్తిగా రద్దు చేయాలి. పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ఉపాధ్యాయులకు సంబంధించి 117 జీఓను రద్దు చేస్తామని మాటిచ్చింది. ప్రస్తుత విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్ ఆ మాటను నిలబెట్టు కోవాలి. ఆ జీఓ వల్ల గ్రామాల్లో 10లోపు విద్యార్థులున్న పాఠశాలలు మూత పడతాయి.

– బడా హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, 1938–ఏపీటీఎఫ్

సర్దుబాటు లోపభూయిష్టం



టీచర్ల సర్దుబాటు ప్రక్రియ మొత్తం లోపభూయిష్టం. సర్దుబాటు ప్రక్రియ గురించి ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి. లేకపోతే అనేక మంది ఉపాధ్యాయులు కిలో మీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది. దీని ప్రభావం విద్యాబోధనపై పడుతుంది. అంతిమంగా నష్టపోయేది విద్యార్థులే.

– సురేంద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి, 1938–ఏపీటీఎఫ్

శాస్త్రీయత లోపించింది



పని సర్దుబాటులో శాస్త్రీయత లోపించింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకండ్ గ్రేడ్ టీచర్లతో నింపటం అన్యాయం. సాధ్యమైనంత వరకు హైస్కూల్‌లో అనుభవం కలిగిన వారినే నియమించే విధంగా చర్యలు తీసుకోవాలి. సెకండ్ గ్రేడ్ టీచర్లతో భర్తీ చేయటం వల్ల బోధనలో సమస్య తలెత్తుతోంది. అన్ని సబ్జెక్టులకు మండల స్థాయిలోనే సర్దుబాటు చేసి ఉంటే బాగుండేది.

– పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ టీఏ

విద్యార్థి కిడ్నాప్‌నకు విఫల యత్నం

- చేయి కొరకడంతో వదిలేసి పారిపోయిన దుండగులు



అయాన్

రొళ్ల: ఓ విద్యార్థిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన రొళ్ల సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఇక్బాల్ సాబ్ రెండో కుమారుడు అయాన్ అనంతపురంలోని శ్రీచైతన్య ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించడంతో శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. మంగళవారం అయాన్ ఇంట్లో ఒక్కడే ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చారు. వారిని చూసి కుక్కలు మొరగడంతో అయాన్ ఎవరంటూ తలుపు తీశాడు. దీంతో ఇద్దరు వ్యక్తులు అయాన్ అరవకుండా నోటిని చేతులతో మూసేశారు. అనంతరం అయాన్‌ను ఎత్తుకుని సమీపంలోని జాతీయ రహదారి వైపు పరుగుతీశారు. అయితే భయాందోళన చెందిన అయాన్... తనను ఎత్తుకున్న వ్యక్తి చేయి కొరకడంతో అతను కింద పడేశాడు. వెంటనే అయాన్ గట్టిగా కేకలు వేయడంతో దుండగులు అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ద్విచక్ర వాహనాల్లో ఉడాయించారు. ఈ ఘటనలో అయాన్ ఎడమచేతికి గాయమైంది. అనంతరం చిన్నారి ఇంటికి చేరుకుని కుటుంబీకులు విషయాన్ని వివరించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుళ్లు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రెక్కీ చేశారు..కన్నడలో మాట్లాడారు

ఐదు రోజుల క్రితం కూడా గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటిపై రాళ్లు విసిరారని, దీంతో కిటికీ అద్దాలు పగిలాయని విద్యార్థి అయాన్ తండ్రి ఇక్బాల్ సాబ్ తెలిపారు. రెండు, మూడు రోజులుగా తమ కుమారుడిని కిడ్నాప్ చేయడానికి దుండగులు రెక్కి చేసినట్లు తెలిసిందన్నారు. అయితే తమ కుమారుడిని ఎందుకు కిడ్నాప్ చేయాలనుకుంటున్నారో తెలియడం లేదన్నారు. తమకు శత్రువులు కూడా ఎవరూ లేరన్నారు. దుండగులు కన్నడలో మాట్లాడినట్లు అయాన్ తెలిపారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు సహకరించండి సారూ!

- బత్తలపల్లి పోలీసుస్టేషన్‌లో 'తమ్ముళ్ల' మౌన ప్రదర్శన
- కొత్త ట్రెండు సృష్టిస్తున్న అధికార పార్టీ నాయకులు





బత్తలపల్లి పోలీసుస్టేషన్ వద్ద మౌన ప్రదర్శన చేపట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం: ఇసుక అక్రమ రవాణా విషయంలో తమకు సహకరించాలంటూ బత్తలపల్లి మండల టీడీపీ నాయకులు మౌన ప్రదర్శన చేపట్టారు. పోలీసులు సీజ్ చేసిన తమ వాహనాలను వెంటనే విడుదల చేయాలంటూ సోమవారం రాత్రి నుంచి పోలీసుస్టేషన్ ఎదుట మౌన ప్రదర్శన చేపట్టారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే మౌనప్రదర్శనలు, నిరసనలు చేస్తుంటారు. కానీ... ఇక్కడ అక్రమాలకు సహకరించాలంటూ టీడీపీ నేతలు మౌనప్రదర్శన చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బత్తలపల్లి మండలంలోని చిత్రావతి పరీవాహక ప్రాంతం నుంచి టీడీపీ నాయకులు రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. నల్లబోయినపల్లి ర్యాంప్ వద్ద ఇసుక అందుబాటులో లేకుండా కృత్రిమ కొరత సృష్టించి.. చిత్రావతి నదిలో జేసీబీలతో తవ్వి టిప్పర్లలో అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ ఉదంతంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో విధిలేని పరిస్థితుల్లో పోలీసులు ఇసుక అక్రమ రవాణా కట్టడిపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే కట్టకిందపల్లి టీడీపీ నాయకుడు విశ్వనాథ్‌కు చెందిన పలు వాహనాలను ఇటీవల సీజ్ చేశారు. దీంతో సదరు నాయకుడు సోమవారం రాత్రి పార్టీ కార్యకర్తలను వెంటబెట్టుకుని వెళ్లి తమ వాహనాలను వదలిపెట్టాలంటూ పోలీసుస్టేషన్ వద్ద మౌనప్రదర్శన చేశారు. మంగళవారం ఉదయం పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వారితో మాట్లాడడంతో నిరసన విరమించారు. అయితే ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

బాలయ్య ఇలాకాలో అరాచకం

హిందూపురంలో టీడీపీ నాయకుల బరితెగింపు

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడి
- 8 మందికి తీవ్ర గాయాలు





హనుమంతరెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేస్తున్న టీడీపీ గూండాలు (ఇన్‌సెట్‌లో) తీవ్రంగా గాయపడిన హనుమంతరెడ్డి

హిందూపురం: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపులు, దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం హిందూపురం పట్టణంలోని కొల్లకుంటలో టీడీపీ నాయకులు బయటి ప్రాంతం నుంచి గూండాలను తీసుకొచ్చి బీభత్సం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్ కొల్లకుంట శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులపై దాడికి పాల్పడ్డారు. టీడీపీ నాయకులు మంజునాథ్ అలియాస్ గొర్రెల మంజు, వడ్డె నవీన్‌తో పాటు బయటి ప్రాంత వ్యక్తులు నలుగురు వాహనంలో వచ్చి ఇంటి వద్ద ఉన్న శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో హనుమంతరెడ్డి, నాగభూషణరెడ్డి, వినుత, యశోదమ్మ, గోవిందరెడ్డి, అలివేలమ్మ, భాగ్యమ్మ, వెంకటలక్ష్మీ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హనుమంతరెడ్డితో పాటు మరో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో అనంతపురం తరలించారు.

వారించినందుకు దాడి

కొల్లకుంటలో సోమవారం గ్రామస్తులు వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ కండువాలు కప్పుకొని నిమజ్జనంలో పాల్గొనడంతో అక్కడున్న వారు అభ్యంతరం తెలిపారు. అయితే తమకు అడ్డు చెప్పరాదంటూ టీడీపీ నాయకులు రచ్చ చేశారు. వారిని వారించిన శివశంకర్‌రెడ్డిని కొట్టడానికి ప్రయత్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి పంపించేశారు. గొడవ సమసిపోయిందనుకునే లోపు మంగళవారం సాయంత్రం మంజునాథ్, వడ్డె నవీన్‌తో పాటు మరో నలుగురు బయట వ్యక్తులు వాహనంలో వచ్చి శివశంకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి మహిళలపై, వృద్ధులపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో శివశంకర్‌రెడ్డి ఇంట్లో లేరు. విషయం తెలుసుకుని గ్రామానికి వచ్చేలోపే.. గ్రామస్తులు దాడి చేసిన వారిని అడ్డుకోవడంతో వారందరూ పారిపోయారు.



మాట్లాడుతున్న శివశంకర్‌రెడ్డి



దాడిలో చిరిగిన దుస్తులను చూపుతున్న యశోదమ్మ

టీడీపీ నాయకులతో ప్రాణహాని

టీడీపీ నాయకులు కక్ష సాధింపులు, దాడులకు పాల్పడుతున్నారని బాధితుడు శివశంకర్‌రెడ్డి వాపోయారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇంట్లో లేని సమయంలో అమ్మ, నాన్న, భార్య, బంధువులపై టీడీపీ నాయకులు దాడి చేశారన్నారు. మహిళలని చూడకుండా నడి వీధిలో దుస్తులు చిరిగేటట్టు, రక్తం వచ్చేలా కొట్టారన్నారు. గత ఐదేళ్లు గ్రామంలో ఏ ఒక్కరినీ తాము దూషించలేదని, గొడవలు చేయలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇలా దాడులు చేయడం చూస్తుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడున్నాయనిపిస్తోందన్నారు. దాడులు చేసిన వారి నుంచి తమకు ప్రాణహాని ఉందన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని, పనులకు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని వాపోయారు.

బాధితులకు పరామర్శ

శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు, మునిసిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ప్రశాంత్, కౌన్సిలర్లు ఆసీఫ్, రామచంద్ర, ముస్తాక్, ఏ బ్లాక్ కన్వీనర్ మన్సూర్, లాయర్ వెంకటరెడ్డి, నాయకులు హబీబ్, ఫారూక్, అయూబ్, మార్కెట్ చాంద్, నవీన్ తదితరులు ఆస్పత్రిలో పరామర్శించారు. జిల్లా ఎస్పీ, హిందూపురం డీఎస్పీ స్పందించి దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలని, కొల్లకుంటలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఉసిరి.. లాభాల సిరి

- జిల్లాలో విస్తరిస్తున్న ఉసిరి తోటలు
- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి
- ఎకరాకు 7.5 టన్నుల దిగుబడి



గోపేపల్లి వద్ద సాగుచేసిన ఉసిరి పంట

నల్లమాడ: సంప్రదాయ పంటల సాగుకు అలవాటు పడిన రైతులు... ఆ పంటలతో ఆశించిన ఫలితం లేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యాన తోటలు క్రమంగా విస్తరిస్తూ వచ్చాయి. మామిడి, జామ, అరటి, బొప్పాయి, దానిమ్మతో పాటు డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి తోటలు, బీర, మునగ, కాకర, బంగాళాదుంప, క్యారెట్ తదితర కూరగాయలు, పూల మొక్కలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇందులోనూ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఉసిరి సాగుపై ఇప్పుడిప్పుడే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి నష్టాలు లేని ఉసిరి మొక్కను ఒక్కసారి నాటితే 40 ఏళ్ల వరకూ దిగుబడి ఉంటోందని ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు అంటున్నారు.

ఏడాదికి రెండు పంటలు

నల్లమాడ మండలం గోపేపల్లి గ్రామానికి చెందిన రైతు ముక్తాపురం రుక్మాంగదరెడ్డి 15 ఏళ్ల క్రితం ఆర్డీటీ సహకారంతో ఎకరా విస్తీర్ణంలో వంద ఉసిరి మొక్కలు నాటాడు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. మొక్క నాటిన ఐదేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమైంది. మొదట్లో ఐదు నుంచి ఏడున్నర టన్నుల వరకూ దిగుబడి వచ్చేది. గత ఏడాది వర్షాభావం కారణంగా కాస్త దిగుబడి తగ్గినా... కిలో రూ.13తో వ్యాపారులే తోట వద్దకు వచ్చి పంట కొనుగోలు చేశారు. ఎరువులు, ఇతర ఖర్చులు పోను రూ.75 వేలు ఆదాయం సమకూరింది. కాగా, ఉసిరి సాగుకు అన్నిరకాల నేలలు అనుకూలంగా ఉంటాయని రైతు రుక్మాంగదరెడ్డి తెలిపారు. తక్కువ పాటి శ్రమ, ఖర్చుతో ఏడాదికి రెండు పంటలు చేతికి వస్తున్నాయని తెలిపారు. క్రమం తప్పక ఎరువులు, నీటి యాజమాన్యం నిర్వహిస్తూ ఉంటే మేలైన దిగుబడులు ఉంటాయని పేర్కొన్నారు.

జిల్లాలో 84 ఎకరాల్లో ఉసిరి

ఉద్యానశాఖ అధికారుల లెక్క ప్రకారం జిల్లాలోని పది మండలాల్లో84.61 ఎకరాల్లో ఉసిరి సాగులో ఉన్నట్లు తెలుస్తోంది. అనధికారికంగా ఈ విస్తీర్ణం మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా. వర్షాభావాన్ని తట్టుకోవడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ సంవత్సరాలు దిగుబడినిచ్చే పంట కావడంతో ఉసిరి సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఔషధగుణాలు పుష్కలంగా ఉండడంతో పంట క్రయవిక్రయాలపై ఎలాంటి ఢోకా ఉండదని, కాయను ఎండబెట్టి విక్రయిస్తే అధిక ఆదాయం పొందవచ్చునని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఉసిరి సాగు వివరాలు ఇలా...

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
బత్తలపల్లి	45.33
ధర్మవరం	23.83
పరిగి	04.93
తాడిమర్రి	02.58
గోరంట్ల	02.05
చిలమత్తూరు	02.00
లేపాక్షి	01.31
గాండ్లపెంట	01.00
రొళ్ల	01.00
నల్లమాడ	01.00
కదిరి	0.58
మొత్తం	84.61 ఎకరాల్లో

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ఉసిరి కాయను ఎండబెట్టి విక్రయిస్తే కిలో రూ.100 చొప్పున అమ్ముడుపోతోంది. ముక్కలుగా కోసి ఆరబెట్టి విక్రయిస్తే కిలో రూ.300 లైనా చెల్లిస్తారు. అయితే జిల్లాలో ఉసిరికి మార్కెట్ సదుపాయం లేదు. పంటను విక్రయించాలంటే హైదరాబాద్, చెన్నై లాంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అంత దూరం వెళ్లలేక వ్యాపారులు ఇచ్చింది తీసుకుని పంట అప్పగించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఉసిరికి మార్కెట్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.
– ముక్తాపురం రుక్మాంగదరెడ్డి, రైతు, గోపేపల్లి, నల్లమాడ మండలం

క్లుప్తంగా

క్రీడల్లో జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం



మాట్లాడుతున్న ఏపీ పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్

పుట్టపర్తి: క్రీడల్లో జిల్లాను అగ్రభాగంలో నిలుపుదామంటూ పీఈటీ, పీడీలకు ఏపీ పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ పిలుపునిచ్చారు. బుక్కపట్నం జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పీఈటీల సమావేశం జరిగింది. డీఈఓ మీనాక్షి, పీఈటీల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సెక్రటరీ మొరార్జీయాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్‌తో పాటు డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ... త్వరలో జరిగే గ్రిగ్స్ పోటీలు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఇటీవల ఉత్తమ అవార్డు పొందిన పీడీ, పీఈటీలను సత్కరించారు. డైట్ వ్యాయామ అధ్యాపకులు రామకృష్ణ, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ట్రెజరర్ రామకృష్ణ, సందీప్, ఏపీ పీడీల అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

14న మహిళా ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీల బ్రోచర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 14న కదిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం యూటీఎఫ్ ధర్మవరం జోన్ మహిళా విభాగం నాయకురాలు మేరీ వరకుమారి, రమీజాబి, లతాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మహిళా ఉపాధ్యాయుల క్రీడా పోటీల బ్రోచర్లను ఆయన విడుదల చేశారు. షటిల్, షాట్‌పుట్, త్రోబాల్, స్పీడ్‌వాక్, టెన్నికాయిట్ తదితర అంశాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న మహిళా ఉపాధ్యాయులు పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామకృష్ణనాయక్, ధర్మవరం పట్టణాధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సాయిగణేష్, నాయకులు లక్ష్మయ్య, రామాంజనేయులు, బిల్లే రామాంజనేయులు, హరిశంకర్, నాగిరెడ్డి, రఫీ అహమ్మద్, నాగేంద్రమ్మ, దుర్గ, శ్రీదేవి, నీరజ, విజయలక్ష్మి, పద్మ, నాగమణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో అందుబాటులో నారు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కూరగాయలు, పూలు నారు పెంచి రైతులకు అందజేస్తున్నారు. ఈ మేరకు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మంగళవారం తెలిపారు. కూరగాయలకు సంబంధించి ఏ నార కావాలో రైతులు ముందుగానే తెలిపితే వాటిని పెంచి అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 99497 37160లో సంప్రదించాలని కోరారు.

అప్లైడ్ జెనెటిక్స్‌లో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న జయప్రీతి

అనంతపురం: ఎమ్మెస్సీ అప్లైడ్ జెనెటిక్స్‌లో అనంతపురానికి చెందిన ఆదిశేషయ్య, లలిత దంపతుల కుమార్తె జయప్రీతి బంగారు పతకాన్ని సాధించింది. మంగళవారం జరిగిన బెంగళూరు యూనివర్సిటీ 59వ స్నాతకోత్సవంలో కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్, వీసీ డాక్టర్ జయకర్, యూజీసీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ ఆమెకు బంగారు పతకాన్ని అందజేశారు. కాగా, జయప్రీతి... 'ద ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్'లో ఎమ్మెస్సీ అప్లైడ్ జెనెటిక్స్ కోర్సును సీజీపీఏ 9.11 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించి బెంగళూరు యూనివర్సిటీ మొదటి ర్యాంక్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బంగారు పతకంతో పాటు ప్రొఫెసర్ ఎన్‌జీ శెట్టి క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు.

విద్యార్థిని హత్య కేసులో వీడిన మిస్టరీ

- నాలుగేళ్లుగా ప్రేమించాలంటూ వేధింపులు
- తనకు కాకుండా మరెవరికీ దక్కకూడదనే ఘాతుకం
- పథకం ప్రకారం వేటకొడవలితో దాడి
- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హేమంత్‌కుమార్

ఆత్మకూరు: ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని సరిత హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. తాను ప్రేమించిన యువతి తనకు కాకుండా మరెవ్వరికీ దక్కకూడదనే దురుద్దేశంతోనే ప్రేమికుడు ఈ ఘాతుకానికి తెగించినట్లు నిర్ధారణ అయింది. కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఆత్మకూరు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్ట్ వివరాలను సీఐ హేమంత్‌కుమార్ వెల్లడించారు. ఈ నెల 7న వడ్డుపల్లి సమీపంలోని పీఏబీఆర్ కాలువ వద్ద విద్యార్థిని సరిత హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో గుమ్మఘట్ట మండలం వెంకటాంపల్లికి చెందిన తిప్పేస్వామి అలియాస్ పండుని అనుమానితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తానే సరితను హతమార్చినట్లు అంగీకరించాడు.

పెళ్లి చేసుకుంటానంటే కుదరదన్నారు

ఆత్మకూరు మండలం సిరిగేదొడ్డ గ్రామానికి చెందిన బోయ సరితను నాలుగైదు ఏళ్లుగా తిప్పేస్వామి ప్రేమించాలని వెంటపడేవాడు. ఈ క్రమంలో ఒకే కులస్తులు కావడంతో సరితను తనకు ఇచ్చి పెళ్లి జరిపించాలని ఓ సారి నేరుగా వెళ్లి ఆమె తండ్రితో మాట్లాడాడు. అయితే తన కుమార్తెను బాగా చదివించాలని అనుకుంటున్నానని, ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పెళ్లి చేసే ఆలోచన తమకు లేదని తల్లిదండ్రులు నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న తిప్పేస్వామి కుటుంబసభ్యులు ఆయనకు మరొక అమ్మాయితో పెళ్లి జరిపించారు. అయినా సరితను ఎలాగైనా దక్కించుకోవాలని తరచూ ఆమెకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఆర్ట్స్ కళాశాలలో చదువుకుంటున్న సరిత... ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే తన చదువును మధ్యలోనే ఆపించేస్తారని భయపడి ఎవరితోనూ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ వచ్చింది.

పథకం ప్రకారమే హత్య

వినాయక చవితి పండుగకు సిరిగేదొడ్డికి సరిత వచ్చిన విషయం తెలుసుకున్న తిప్పేస్వామి ఆమెకు ఫోన్ చేశాడు. 'ఈ రోజు కలవకపోతే నీ అంతు చూస్తా... నీ కాలేజీకే వచ్చి నిన్ను అల్లరి పెడతా' అని బెదిరించాడు. దీంతో భయపడిన సరిత తనకు కళాశాలలో పని ఉందంటూ తండ్రి తెలిపి శనివారం అనంతపురానికి వెళ్లే బస్సు ఎక్కింది. విషయం తెలుసుకున్న తిప్పేస్వామి ఆమెను పంపనూరు సిటీ పార్క్ వద్ద బస్సు నుంచి కిందకు దిగేలా చేశాడు. అనంతరం తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వడ్డుపల్లి సమీపంలోని పీఏబీఆర్ కాలువ వద్దకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుందామంటూ బలవంతం చేశాడు. అందుకు ఆమె అంగీకరించలేదు. అదే సమయంలో తన తండ్రి ఫోన్ చేయడంతో తల దించుకుని మాట్లాడుతుండగా... తన వెంట తెచ్చుకున్న వేటకొడవలితో సరిత మెడపై బలంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం సిరిగేదొడ్డి సమీపంలో తిప్పేస్వామిని అరెస్ట్ చేసి, వివరాలు ఆరా తీయడంతో నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి వేటకొడవలి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

9 గంటల్లో 11 ఎకరాల్లో గుంటక పాసిన రైతు



రైతు మహేష్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన రైతు గొరువ మహేష్ అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం తొమ్మిది గంటల్లో 11 ఎకరాలు బడుగు గుంటుకతో పొలాన్ని పాసి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు మొదలు పెట్టిన పనిని మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేయడంతో గ్రామస్తులు అభినందిస్తూ మహేష్‌తో పాటు ఆయన ఎద్దులనూ ఊరేగించారు. సాధారణంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

బత్తలపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉచితంగా నాలుగు నెలల పాటు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఏపీఓ ఆదెప్ప మంగళవారం తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 2018 నుంచి 2024 వరకు వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుంది. రిటైల్ స్టోర్ డిపార్టుమెంట్ మేనేజర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఉచిత యూనిఫారం, మెటీరియల్, భోజన వసతి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13న అనంతపురం శివారులోని ధర్మవరం పంగల్ రోడ్డు వద్ద ఉన్న టీటీడీసీ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు. పూర్తి వివరాలకు 89195 74632లో సంప్రదించవచ్చు.

జాబ్‌మేళాలో 64 మంది ఎంపిక

హిందూపురం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 64 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి. దాదాపు 147 మంది హాజరు కాగా ఐదు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 64 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

వివాహిత ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత శ్రావణి (24) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గుర్తించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న భర్త హరి ఆగమేఘాలపై ఆటోలో ఇంటికి చేరుకున్నాడు. భార్య మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. సమాచారం అదుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి దుర్మరణం

బత్తలపల్లి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం యర్రాయపల్లికి చెందిన కమతం వెంకటనారాయణ (55) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పనిపై మంగళవారం అనంతపురానికి వెళ్లిన ఆయన పనులు ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నీల సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై వెనుకనే వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో వెంకటనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. అటుగా వస్తున్న ఆటో డ్రైవర్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, అప్రమత్తం చేయడంతో ఇటుకల పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

హిందూపురం టౌన్: స్థానిక దండు రోడ్డులోని ఎస్‌పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంతో పాటు మంజు బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13వ తేదీ వరకూ పోటీలు జరుగుతాయని అకాడమీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ఇప్పటికే 200 మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని వచ్చే నెల హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అకాడమీ సభ్యులు జెమిని నాగరాజు, శ్రీధర్, దాదాఖలందర్, షెక్షావలి, జెమిని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించండి

- సీఎం చంద్రబాబుకు సత్యసాయి వాటర్ సప్లై కార్మికుల వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: ''ఆరు నెలలుగా జీతాలు లేవు. ఊరంతా పండుగ చేసుకుంటుంటే మా కుటుంబాలు పస్తున్నాయి. ఇకనైనా మా మొర ఆలకించండి. మాకు జీతాలు మంజూరు చేయండి'' అని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో మంగళవారం కార్మికులు కొత్తచెరువులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాల ముందు చెవిలో పూలు పెట్టుకొని భజనలు చేస్తూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. అలాగే పుట్టపర్తి పట్టణంలో సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా నిరసన చేస్తున్నా, ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఆరు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాద్రి, రమేష్, కార్మికులు ప్రభ, కేశవ, నాగేంద్ర, రవి, చంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి



తీవ్రంగా గాయపడిన నరసింహులు, సాయికుమార్



వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు


- ట్రాక్టర్ బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తుండగా అపశ్రుతి చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. వివరాలు... ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో కొలువుదీర్చిన వినాయకుడి ప్రతిమను మంగళవారంనిమజ్జనం చేసేందుకు పలువురు యువకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఎక్కించి సంగమేశ్వరం వద్ద ఉన్న చిత్రావతి నది వద్దకు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో తుమ్మల గ్రామ సమీపంలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఘటనలో నరసింహులు, సాయికుమార్, క్రాంతి కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి, శివయ్య, భార్గవ, ఇంద్రసేన గౌడ్, మోహన్, ప్రతాప్, మారుతి, మనోహర్, నవీన్, భాను ప్రకాష్, పవన్‌కుమార్, నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ నరేంద్ర, సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని అనంతపురానికి రెఫర్ చేశారు.

బాబు కోసం జనాన్ని ముంచేశారు

- కూటమి బాధ్యతా రాహిత్యం వల్లే విజయవాడలో వరదలు
- చంద్రబాబు ఇల్లు, రాధాకృష్ణ పవర్ ప్లాంట్ కోసమే గేట్లు ఎత్తారు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం





పెనుకొండ: ''ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు, రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోతాయన్న భయంతో అధికారులు అర్ధరాత్రి బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటరీ ద్వారా విజయవాడ మీదకు నీరు వదిలేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గేట్లు ఎత్తడంతో విజయవాడను నీరు చుట్టేసింది. లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి స్వార్థం కోసం 50 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అనేక కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డు పడ్డాయి. ఇది ముమ్మాటికీ 'కూటమి' సర్కార్ బాధ్యతారాహిత్యమే'' అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. మంగళవారం విజయవాడ వరదలకు దారితీసిన పరిస్థితులు..తదనంతర పరిణామాలు, ప్రభుత్వ తీసుకున్న చర్యలపై పెనుకొండలో మీడియాతో మాట్లాడారు. మానవ తప్పిదంతోనే బుడమేరు నీరు విజయవాడను చుట్టేసిందన్నారు. లక్షలాది మంది జనం వరదల్లో చిక్కుకుని అల్లాడిపోతుంటే మానవత్వంతో స్పందించాల్సిన చంద్రబాబు ప్రచారం కోసం హడావుడి చేశారని మండిపడ్డారు. కనీసం వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు, తాగునీరు అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసుకురావడం మాని, బోట్లలో వెళుతూ చంద్రబాబు షో చేశారని, దీంతో ఎందరో బాధితులు రెండు, మూడు రోజులు కనీసం నీరు లేక వరద నీటిలోనే చిక్కుకుపోయారన్నారు. అలాగే సమీక్షల పేరుతో వరద ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికార యంత్రాంగాన్ని తనచుట్టూ కూర్చోబెట్టుకున్న చంద్రబాబు బాధితులకు తక్షణ సాయం అందకుండా చేశారన్నారు.

హెచ్చరికలు పట్టించుకోలేదు

ఎప్పుడు భారీ వర్షాలు వచ్చినా ముందుగానే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుందని, వాటిని కూడా కూటమి సర్కార్ పెద్దగా పట్టించుకోలేదని ఉషశ్రీచరణ్ అన్నారు. భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రభుత్వం ముందుగానే స్పందించి లోతట్టు ప్రాంతాల వారిని మరో ప్రాంతానికి తరలించే ఉంటే ఇలాంటి పరిస్థితి తలెత్తేదికాదన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

వలంటీర్లు ఉంటే పరిస్థితి మరోలా ఉండేది

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో మేలు చేశారని ఉషశ్రీచరణ్ కొనియాడారు. కరోనా కష్టకాలంలోనూ వలంటీర్ల అందించిన సేవలు రాష్ట్ర ప్రజలు మరువలేరన్నారు. సకాలంలో ఆస్పత్రులకు చేర్చడం, మందులు అందించడం, వైద్య సేవలపై సాయం చేయడం వలంటీర్ వ్యవస్థ గొప్పతనానికి నిదర్శనమన్నారు. నేడు జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అందుబాటులో ఉంటే విజయవాడ వరద బాధితులకు ఎంతో సహకారం అందించి వారి ప్రాణాలు కాపాడేవారన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం విజయవాడ ప్రజలకు తీరని విషాదం మిగిల్చిందన్నారు. ఈ విషాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర ప్రజలంతా విజయవాడ వరద బాధిత ప్రజానీకానికి అండగా నిలవాలని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ కోరారు.